క్లుప్తంగా

'నిందితులను శిక్షించాలి'



పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ

సాలూరు: మణిపూర్‌లో హత్యాచారాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్ఫూర్తి మహిళా మండలి, పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. బాధితులకు న్యాయం చేసి నిందితులను శిక్షించాలని కోరారు.

కొత్త ప్రతిపాదనలు సమర్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా కొత్త ప్రతిపాదనలు సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఉప ప్రణాళిక కింద చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ సురేష్, ఈఈ జె.శాంతేశ్వరరావు, మత్స్యశాఖాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి


- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ప్రభుత్వ భవనాల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇంతవరకు నిర్మాణం చేసిన భవనాలకు సంబంధించి ప్రభుత్వం పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించిందని వివరించారు. బిల్లు చెల్లింపునకు ఎటువంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. ఆగస్టు నెలలో భవనాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే



కొండాపురంలో ఓటర్ల సర్వే చేస్తున్న సిబ్బంది

పాలకొండ: మండలంలో ఓటర్లు జాబితా పరిశీలన సర్వే ముమ్మరంగా జరుగుతోంది. బీఎల్‌ఓలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని వివరాలను పరిశీలిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు జాబితాలో ఉన్న తప్పులను సరిచేస్తున్నారు. మండలంలోని కొండాపురం, సింగన్నవలస, అంపిలి, వెలగవాడ తదితర గ్రామాల్లో సోమవారం బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టారు.

జలజీవన్ పనుల పరిశీలన



తాగునీటి కుళాయిని పరిశీలిస్తున్న అధికారులు

భామిని: గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్దేశించిన జలజీవన్ పథకాలను వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటరావు ఆదేశించారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఏఈఈ అలికాన సందీప్‌తో కలిసి సోమవారం పర్యటించారు. గిరిజన మహిళలతో మాట్లాడి తాగునీటి సరఫరాపై ఆరాతీశారు. ఒక్కోదానికి రూ.8 లక్షలు అంచనా వ్యయంతో 13 గ్రామాల్లో తాగునీటి పథకాలు నిర్మిస్తున్నట్లు ఈఈ వెంకటరావు తెలిపారు.

జోరుగా సీసీ కాలువల నిర్మాణం

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం పంచాయతీ, రంగరాయపురం గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం జోరుగా జరుగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన దాదాపు రూ.5 లక్షల నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పప్పల గణపతిరావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సాలూరు నుంచి పాచిపెంట వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు కార్యకర్తలు

పాచిపెంట: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత దేశంలో ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ జి. పార్వతి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోల బాబ్జి, వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందు స్థానిక నాయకులు, కార్యకర్తలు సాలూరు నుంచి పాచిపెంట వరకు భారీ బైక్ ర్యాలీతో మంత్రి, జెడ్పీ చైర్మన్లకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, కోటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గండిపల్లి రాము, కేసలి సర్పంచ్ ప్రతినిధి సతారపు రాము, స్థానిక నాయకులు మీసాల ఆదినారాయణ, మంత్రి సత్యనారాయణ, గునాపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి గృహప్రవేశాలకు నిర్వాహకులు సిద్ధం చేసేలా ఇంజినీరింగ్ సహాయకులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ జానకీరాం అధ్యక్షతన ఇంజినీరింగ్ సహాయకులతో జగనన్న కాలనీల్లో ఇళ్లనిర్మాణం, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వసతులతో కూడిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులను సంప్రదించి పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించడానికి గృహనిర్మాణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు

వీరఘట్టం: ఖరీఫ్ సీజను కావడంతో పశుగ్రాసం కొరత లేకుండా మండల వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వీరఘట్టం పశు వైద్యాధికారి చైతన్య శంకర్ తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 1000 కిలోల గడ్డి విత్తనాలను 77 శాతం సబ్సిడీపై యూనిట్(5 కిలోలు) రూ.109ల చొప్పున రైతులకు అందజేయడం జరిగిందన్నారు. అలాగే పాడి అభివృద్ధికి, పాలసేకరణ కేంద్రాలకు 12 చోట్ల స్థల సేకరణ చేసి రైతులకు అప్పగించామన్నారు. పశువులకు చర్మ వ్యాధులు సోకకుండా ఎఫ్ అండ్ ఎం సంచల టీకాలు, లంపీ స్కిన్ వ్యాధి టీకాలు, గొంతువాపు, జబ్బవాపు టీకాలు వేశామన్నారు. గొర్రెలు, మేకలకు 4 రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందన్నారు. యాక్సిడెంట్స్, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న పశువులకు అరుదైన శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు. దీంతో వీరఘట్టం పశువైద్యశాలలో ఓపీ బాగా పెరిగిందన్నారు. అలాగే అరుదైన మేలు జాతి కుక్కలకు, గొర్రెలకు, మేకలకు, పశువులకు క్రాస్ బ్రీడింగ్ కూడా చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వం సమకూర్చిన అత్యవసర వాహనం ద్వారా అన్ని ఊళ్లలో సంచార పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. మార్కెట్‌లో గొర్రెలు, మేక మాంసాల విక్రయాలు చేపట్టేవారితో మాట్లాడి ప్రజలకు నాణ్యమైన మటన్ విక్రయించేలా సూచనలు చేసినట్లు చెప్పారు. ఎవరైన చనిపోయిన గొర్రెలు, మేక మాంసాలు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డాక్టర్ చైతన్య శంకర్ హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్సీ విక్రాంత్ సమీక్షించారు. సీసీరోడ్లు, కాలువల నిర్మాణం తదితర పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డు నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. సమావేశంలో నగరపంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లోకాస్ యాప్‌లో డ్వాక్రా సంఘాల వివరాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీసీ రాజా

వీరఘట్టం: ఇకమీదట డ్వాక్రా సంఘాలు చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని లోకాస్ యాప్‌లో నమోదు చేయాలని వెలుగు సీసీ రాజా పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకాస్ యాప్‌లో ప్రతీ సంఘం తమ సభ్యుల వివరాలను, వైఎస్సార్ ఆసరా, చేదోడు పథకాలు పొందిన వారి వివరాలు, పొదుపు, తీసుకున్న రుణాలు తదితర అన్ని వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే మొండిబకాయిలు వసూళ్లపై సంఘాలు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం బి.శివున్నాయుడు, గ్రామ సంఘాల అధ్యక్షులు, వీఓఏలు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి క్షేత్రాల పరిశీలన



నారు క్షేత్రాలను పరిశీలిస్తున్న ఏఓ సింహాచలం

భామిని: గ్రామీణ విత్తనాభివృద్ధి పథకంలో భాగంగా మండలంలోని గురండి గ్రామంలో ఫౌండేషన్ సీడ్స్‌తో వేసిన నారుమడులను ఏఓ కొర్ను సింహాచలం సోమవారం పరిశీలించారు. విత్తనాభివృద్ధి పథకం ఆవశ్యకతను రైతులకు వివరించారు. రైతులకు రాయితీపై ఫౌండేషన్ సీడ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. 25 ఎకరాల్లో వేసిన ఎంటీయూ–1060 రకం, ఇంద్ర రకం విత్తన క్షేత్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ పథకంలో పండించిన ధాన్యంను విత్తనాలుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఏఏలు ఈశ్వరరావు, తేజ ఉన్నారు.

3న మన్యంలో బంద్

సీతంపేట: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 3న పార్వతీపురం మన్యం జిల్లాలో బంద్ పాటిస్తున్నట్లు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో 160 మంది మరణించారని, 500 మందికిపైగా గాయపడ్డారని పేర్కొన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బంద్‌లో పాల్గొని మద్దతు తెలిపాలని కోరారు.

పౌష్టికాహారం పక్కదారి!

కురుపాం: కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారులకు అందించాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో మొత్తం 316 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలు సుమారు 1500 మంది ఉన్నారు. వారంతా రక్తహీనత బారిన పడకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. ప్రతీ నెల ఒక్కో బాలికకు కిలో కందిపప్పు, అర లీటరు వంట నూనె, 3 కిలోల బియ్యం, గుడ్లు-20 (టీహెచ్ఆర్-టేక్ హోమ్ రేషన్) వరకు గత నెల నుంచి సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రాజెక్టు పరిధిలో ఉన్న బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకులు పంపిణీ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిరిశిఖర గ్రామాల్లో ఉన్న బాలికలకు అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ఈ విధంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తోందన్న విషయం కూడా తెలియని పరిస్థితి. ఇంత మంది బాలికలకు అందాల్సిన పౌష్టికాహారం ఏమైనట్లో ఆయా అధికారులకు, పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లకే తెలియాలని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ విషయమై కురుపాం ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రాజ్యలక్ష్మి వద్ద ప్రస్తావించగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపడతామని, దీనిపై పూర్తిగా విచారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ పరీక్షలు

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పి.లక్ష్మణ దొర తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎమ్మార్సీ భవనంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలో మొత్తం 48 పాఠశాలలు ఉండగా, ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు సరిపడ ప్రశ్నపత్రాలు సిద్ధం చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రెండు రోజులు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నాలుగు రోజుల పాటు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఏ రోజు పరీక్షకు సంబంధించి, ఆ రోజే ప్రశ్నపత్రాలను పాఠశాలల సిబ్బంది తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం సీఆర్‌పీలు నాగమణి, రామకృష్ణ, వెంకటరమణ ప్రశ్నపత్రాలు సిద్ధం చేస్తుండడాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు డిమాండ్

బొబ్బిలి: నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) డిమాండ్ చేస్తోంది. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు సోమవారం ధర్నా చేపట్టారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న, ప్రభుత్వ అనుమతి లేకుండా వసతిగృహాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ డోల రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, పోలిరాజు, శివ, శరత్, వంశీ, గీత, జ్యోతి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కళ్ల కలకల వ్యాధి దూరం

రాజాం సిటీ: సకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కళ్లకలకల వ్యాధి నుంచి దూరం కావచ్చని ఆప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు అన్నారు. సోమవారం మండలంలోని కంచరాం సృజన విద్యాలయంలో కళ్లకలకల వ్యాధి, నివారణ చర్యల పై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రోజుకు నాలుగు నుంచి ఆరుసార్లు మంచినీటితో కళ్లను పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కల మందు వినియోగించాలన్నారు. వాడిన రుమాలు, టవల్స్, సబ్బులు వాడకూడదన్నారు.సి-విటమిన్ ఉన్న పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

బాడంగి: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ ఆర్.జయంతి కోరారు. మండలంలోని పూడివలస జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. అటువైపుగా ఓవర్‌లోడుతో వస్తున్న ఆటోలను ఆపి, అందులో ఉన్న వారిని వాహనాల నుంచి దింపేశారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండరాదని, ఓవర్‌లోడుతో లగేజి వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యంతాగి వాహనాలు నడపవద్దన్నారు.

మాట తప్పని నేత జగనన్న



చిలకలపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అధికారంలోకి రాకముందు పాదయాత్ర సమయంలో చెప్పినవన్నీ అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చిన నేత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం చిలకలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటప్రకారం క్రమం తప్పకుండా తేదీల వారీగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమచేస్తూ హామీలను అమలు చేస్తున్నారని అందుకే ఆయనను మాట తప్పని నేత అని అంటారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన గొప్ప సీఎంగా మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించారని చెప్పారు. సంక్షేమ పథకాలను తు.చ తప్పకుండా అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు అక్కసుతో జగన్‌మోహన్ రెడ్డి పాలనపై విషం కక్కుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు.

గతమంతా జన్మభూమి కమిటీల దయ

గత ప్రభుత్వంలో సంక్షేమం లేదు, అర్హత లేదు, పారదర్శకత లేదు. అంతా జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై నడిచేదని, అర్హులున్నా సంక్షేమ ఫలాలు అందేవికాదని తెలిపారు. అటువంటి పాలనను, మాట తప్పని నేత సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనను ప్రజలు బేరీజు వేసుకుని రానున్న ఎన్నికలలో ఓటువేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఇంకా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే ఎందుకు రాలేదని తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేసుకుంటూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రజలకు అసౌకర్యం ఉంటే తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాద్, జగన్నాథం మాస్టారు, సర్పంచ్‌లు విజయ, ఎన్.పాపారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.పకీరునాయుడు, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, జి.శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



హాజరైన కౌన్సిల్ సభ్యులు

- కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం పురపాలక సంఘం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రతిపాదించిన పలు తీర్మానాలను సభాముఖంగా ఆమోదించారు. అలాగే పట్టణంలో అతి ప్రధానమైన తాగునీరు సరఫరా, నీటిశుద్ధి విషయమై సమావేశంలో చర్చించి ప్రజలకు బురద లేకుండా స్వచ్ఛమైన నీరు అందివ్వాలని అధికారులను ఆదేశిస్తూ, మంచినీరు లిఫ్టింగ్‌కు అవసరమైన 2 జనరేటర్ల ఖరీదు కోసం కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అలాగే వార్డులలో శానిటేషన్, విద్యుత్ దీపాల సదుపాయం సరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్‌లు కోరగా తప్పకుండా ఆయా సమస్యలు పరిష్కరిస్తామని సంబంధిత అధికారుల తరపున కమిషనర్ రామప్పల నాయుడు సభ్యులకు బదులిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఏఈ ఆనంద్, ఇతర శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 53 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 53 వినతులు వచ్చాయి. ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి వినతులు స్వీకరించారు. మేకల కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని పెద్దొడిగూడకు చెందిన కృష్ణారావు అధికారులను కోరారు. కుమ్మరిగండిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ బిల్లులు మంజూరు చేయాలని సిమ్మయ్య, ఈతమానుగూడకు చెందిన లక్కమ్మ ఇంటి నిర్మాణ బిల్లు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. మోహన్‌కాలనీకి చెందిన మజ్జయ్య అటవీహక్కుల పత్రం రికార్డులో నమోదు చేయాలని కోరారు. చాపరాయిగూడ గ్రామస్తుడు సుందరరావు వన్‌బీ, అడంగల్ ఇప్పించాలని, సవరకిల్లి గ్రామస్తులు ఢిల్లేశ్వరి కొండపోడు పట్టా మంజూరు చేయాలని విన్నవించారు. స్పందనలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, పీహెచ్ఓ ఎస్వీ గణేష్, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి, హెచ్‌ఓలు ఆయంతి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

సీతంపేట: హర్షివెల్లి సాంస్కృతిక సాంఘిక సేవా సంస్థ పాలకొండ వారి ఆధ్వర్యంలో ఒంటారియో టీచర్స్ ఫెడరేషన్ (ఓటీఎఫ్) సహకారంతో మండలంలోని పెద్దూరు, వలగెడ్డ, పనుకువలస, సోమగండి తదితర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. అల్లావుద్దీన్ అద్భుత కథలు, బాలగేయాలు, మురిపించే బొమ్మలు, జంతువులకు సంబంధించిన వివిధ పుస్తకాలను అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు నందాన సుధాకర్ తెలిపారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, శ్రీనివాసరావు, సవర ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి మలుపుల వద్ద పోలీసులు సోమవారం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై షణ్ముఖరావు మాట్లాడుతూ వాహనదారులు మలుపులను గమనించాలని, అతివేగంగా వాహనాలు నడపొద్దని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని అన్నారు. ఆయనతో పాటు హెచ్‌సీ దొర ఉన్నారు.